

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:24 (శనివారం సాయంత్రం)
సహర్ : 4:38 (ఆదివారం ఉదయం)

గతేడాదికంటే అధిక ఉష్ణోగ్రత



బండారులంకలో మంచు కమ్మేసిన దృశ్యం



అమలాపురంలో ఎండ పాట్లు

'మంచు'టెండ

ఉదయం పొగమంచు.. మధ్యాహ్నం భానుడి భగభగలు

అమలాపురం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉదయం దట్టమైన పొగమంచు.. మధ్యాహ్నానికి భానుడి భగభగలతో పల్లె, పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఏడు గంటల వరకు మంచుతెరలు తొలగలేదు. కానీ తొమ్మిది గంటల సమయానికి భానుడు ప్రతాపం మొదలైపోయింది. మధ్యాహ్నం 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ అంతకంటే ఎక్కువ వేడి వాతావరణం ముప్పుతిప్పలు పెట్టింది. వాతావరణశాఖ జారీ చేసిన హెచ్చరికల మేరకు రానున్న రెండు రోజుల్లో 38 నుంచి 40 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండడంతో మార్చి నెలలోనే వడదెబ్బ తగులుతోంది.

వడదెబ్బ బారి నుంచి రక్షణ చర్యలు చేపట్టాలి : కలెక్టర్

అమలాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు గత ఏడాదికంటే ఈ ఏడాది రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. వడదెబ్బ బారి నుంచి ప్రజలు రక్షణ పొందేందుకు చేపడుతున్న చర్యలపై శాఖల వారీగా నివేదికలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వమించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల పనివేళల్లో మార్పులు చేయాలన్నారు. వారు పనిచేసే ప్రాంతాల్లో తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎటువంటి పనులు నిర్వహించొద్దన్నారు. పాఠశాలల సమయాలు మార్పు చేయాలన్నారు. బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రజలు రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలన్నారు. తెల్లని కాటన్ దుస్తులు, వదులుగా ఉండే వాటిని ధరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి పాల్గొన్నారు.



అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరుకు కేటాయించిన 200 ఎకరాల మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ఆనంద..తీరం!

మళ్లీ తెర మీదకు 'డ్రెడ్జింగ్' కార్పొరేషన్, యూనివర్సిటీ

- పదేళ్ల కిందట చంద్రబాబు ప్రకటన
- నాడు చొరవ చూపని కేంద్రం
- కనీసం పట్టించుకోని వైసీపీ
- కూటమి రాకతో మళ్లీ వెలుగు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- నేడు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్
- అంతర్వేదిలో ఆర్డీవో పర్యటన
- 200 ఎకరాల భూముల గుర్తింపు

అంతర్వేది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబునాయుడు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అంతర్వేది తీరంలో ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై అప్పటి ఎంపీగా ఉన్న డాక్టర్ పండుల రవీంద్రబాబు కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. అయితే అప్పట్లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నష్టాల్లో ఉందన్న సాకుతో ఈ ప్రతిపాదనకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు. అప్పట్లో కార్పొరేషన్ వస్తుందన్న ప్రచారంతో సముద్రతీర ప్రాంతంలో తక్కువ ధర ఉన్న భూములను సైతం అధిక ధరలకు కొనుగోలు చేసి రిసార్టులు, ఇతర భవనాలు నిర్మించారు. కానీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రతిపాదన గత పదేళ్లలో మరుగున పడిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ ఊసేలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ సీఎం చంద్రబాబు అంతర్వేది తీరంలోనే అనువైన ప్రదేశంగా భావించి అక్కడే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. దీనికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సైతం మొగ్గు చూపడంతో మళ్లీ ప్రాజెక్టు అమలుపై జిల్లా ప్రజల్లో ఆశలు చిగురించాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవి అంతర్వేది తీరాన్ని పరిశీలించి డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటుకు సుమారు 200 ఎకరాల భూమి అవసరంగా భావించి పరిశీలన చేసి ప్రాథమికంగా మార్కింగ్ కూడా ఇచ్చారు. దాంతో ఇప్పుడు మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాజోలు నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, ఇతర సౌకర్యాలు లభిస్తాయనేది వారి ఆకాంక్ష. ప్రస్తుతం ఆర్డీవో మాధవి తీర ప్రాంత భూముల పరిశీలనతో ఆ ప్రాంతంలో మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో హడావుడి నెలకొంది.

చిగురించిన ఆశలు

భూములు పరిశీలించిన ఆర్డీవో..

సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ కోసం స్థల పరిశీలన చేశామని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆమె దర్శించుకుని అనంతరం అంతర్వేది నుంచి చింతలమోరి వరకు ఉన్న తీర ప్రాంత భూములను స్థానిక అధికార యంత్రాంగం, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరు ఏర్పాటుకు 200 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు.ఆ భూముల్లో ప్రస్తుతం రూ.1850 కోట్లతో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటికే సముద్రతీరంలో పెరుగు భూములను పరిశీలించి మార్కింగ్ వేశామని, వాటిని సర్వేచేయించి ఎంత భూమి అవసరం అవుతుందో మ్యాపు ద్వారా పరిశీలించి నివేదిక తయారు చేస్తామన్నారు. తీర ప్రాంత భూముల్లో సరుగుడు, కొబ్బరి వేసి ఉన్న రైతులకు నష్టం కలుగుతుందని రైతులు అమలాపురం ఆర్డీవో కె.మాధవిని అడగ్గా ఆమె రైతులతో మాట్లాడారు. పెరుగు భూమిలోనే సాగు చేసుకుంటున్నారు కదా నష్టపోయేదేమి ఉంది.. ప్రభుత్వం స్వాధీన పరుచుకుని డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తే అంతర్వేది పరిసరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్లు, ఉపాధి కలుగుతుందని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, సర్వేయర్ భద్రరాజు, పలు సొసైటీల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ పాపాల పుట్ట..
ఈ మెట్ట : ఎటు చూసినా రామేశం మెట్టంతా ఇలా గుల్లగుల్ల చేశారు. (ఫైల్)

రామేశం మెట్టలో.. పాపాల ద్వారం!

గత ఐదేళ్లూ కొండలను మింగేసిన ఘనులు

గత వైసీపీ ఐదేళ్ల పాలనకు పై చిత్రం ఒక నిదర్శనం.. ఉమ్మడి జిల్లాలో చాలా కొండలది ఇదే పరిస్థితి.. కన్నుపడితే చాలు ఖాళీ చేసేశారు.. కొండలను మింగేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.. ఇదెక్కడో మారుమూల కాదు.. పెద్దాపురం రామేశం మెట్ట.. ఏకంగా 823 ఎకరాల్లో ఉన్న కొండ నేడు ఇలా తయారైంది.. గత ఐదేళ్లలో ఈ కొండను గుల్ల చేసి వేల కోట్లు దందా చేశారు.. ఎన్‌జీటీ దృష్టి సారించడంలో పాపాల ద్వారాలు తెరుచుకోనున్నాయి.. అక్రమార్కుల భరతం పట్టే సమయం ఆసన్నమైంది.

\- కాకినాడ/ఆంధ్రజ్యోతి

- నాడు రెచ్చిపోయిన మాఫియా
- అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకం
- 823 ఎకరాలు గుల్లగుల్ల
- లక్షల క్యూబిక్ మీటర్ల తరలింపు
- 19న ఎన్‌జీటీ కోర్టులో కేసు
- కాకినాడ కీలక నేత కనుసన్నల్లో దందా
- రిజర్వు ఫారెస్టు మింగేసిన వైనం
- రూ.250 కోట్ల రాయల్టీ ఆదాయానికి గండి



పెద్దాపురం రామేశ్వరం మెట్ట అక్రమ తవ్వకాలపై అక్రమార్కులకు ఉచ్చు బిగుస్తోంది. ఇన్నేళ్లపాటు యథేచ్ఛగా 823 ఎకరాల్లో కొండలను గుల్ల చేసి గ్రావెల్ తవ్వుకుపోయి వందల కోట్లు సంపాదించిన నేతలు, అధికారులపై ఎన్‌జీటీ రూపంలో భారీ షాక్ తగలబోతోంది. ఇక్కడ వేల కోట్ల దందాపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ దృష్టి సారించింది. దీంతో అక్రమార్కులు, వారికి కొమ్ముకాసిన అధికారులు ఇరుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొండలు గుల్ల గుల్ల

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, కోనసీమ, యానాం తదితర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, రహదారుల నిర్మాణ అవసరాలకు మట్టి, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉండేది. రామేశం మెట్టలో తవ్విన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చదును కోసం అమ్మని రియల్ ఎస్టేట్ వెంచర్ లేదు. వేల టిప్పర్ల మట్టి, గ్రావెల్‌ను కాకినాడలోని కీలక వైసీపీ నేత తన అనుచరుల ద్వారా విక్రయించి సంపాదించిన కోట్లకు లెక్కేలేదు. అప్పటి సర్కారులో ముఖ్య నేతకు అతి సన్నిహితమైన వ్యక్తి కావడంతో ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదు. పేదల ఇళ్ల స్థలాల చదును ముసుగులో అప్పటి తన సామాజిక వర్గ కలెక్టర్ సహకారంతో సదరు కీలక నేత అనుమతులు తీసుకుని ఇక్కడున్న కొండలు, గుట్టలను ఖాళీ చేసి వందల కోట్లకు పడగలెత్తారు. గనులశాఖ అధికారులంతా ఐదేళ్లపాటు అడ్డుకోకపోవడంతో పెద్దపెద్ద కొండలన్నీ కరిగిపోయాయి. 823 ఎకరాల మెట్టంతా మింగేసి సగానికి పైగా భూములను సదరు వైసీపీ అక్రమార్కులు లోయలుగా మార్చేసినా జిల్లా గనుల శాఖ మౌనమే వహించింది. కొన్ని భూములను ప్రభుత్వం స్థానిక ఎస్సీ రైతుల సాగు కోసం అసైన్డ్ భూముల కింద కేటాయించింది. వీటిని ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున చెల్లించి ఇరవై అడుగుల లోతుకు మట్టి, గ్రావెల్ తరలించుకుపోయారు. వందల ఎకరాల అసైన్డ్ భూములను లీజుకు తీసుకుని లోయలుగా మార్చేసినా రెవెన్యూశాఖ సైతం కన్నెత్తి చూడలేదు. ఈ రెండు శాఖలు ఉమ్మడిగా సర్వే చేసి తవ్వి తరలించుకుపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి సంగతి తేల్చుతామని ప్రగల్భాలు పలికి సర్వే జోలికి వెళ్లలేదు. కరెంటు స్తంభాలైతే అడుగు నుంచీ గాల్లో వేలాడుతున్నాయి. ఇక్కడ నుంచి తరలిపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టికి గనులశాఖకు రూ.250 కోట్లకుపైనే రాయల్టీకి గండిప డింది. అయినా జరిమానా విధించే సాహసం చేయడం లేదు. అక్రమ తవ్వకాలపై స్పందనలో ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం ఎన్‌జీటీని ఆశ్రయించడంతో కదలిక వచ్చింది.

ప్రత్యేక కమిటీతో దర్యాప్తు చేయండి...

రామేశ్వరం మెట్ట అక్రమాలపై రెండేళ్ల కిందట పెద్దాపురానికి చెందిన ఓ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించినా నీరుగార్చేశారు. మళ్లీ ఇప్పుడు పెద్దాపురానికి చెందిన కర్రి వెంకట రమణ తాజాగా చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. మెట్టలో వందల కోట్ల అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేయించాలని ఆధారాలతో సహా పిటిషన్‌లో కోరారు. దీనిపై స్పందించిన ఎన్‌జీటీ కేసును ఎట్టకేలకు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మార్చి 19న కేసును రిజిస్టర్ చేసింది. దీంతో అక్రమార్కులకు ఉచ్చు బిగుసుకోనుంది. మెట్ట అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తే వందల కోట్ల కుంభకోణం బట్టబయలు కానుంది. అక్రమార్కుల నుంచి కళ్లప్పగించి చూసిన గనులు, రెవెన్యూ శాఖలు ఇరుక్కోనున్నాయి. మరోపక్క మెట్టలో అసైన్డ్ భూమాఫియా, అటవీ చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపైనా పిటిషనర్ ఫిర్యాదు చేయడంతో ఎన్జీటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. అయితే కాకినాడ నగరంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో మడ భూములను చదును చేసేసిన కేసులో ఇప్పటికే ఎన్జీటీ బాధ్యులైన అధికారులకు చుక్కలు చూపించింది. కోట్లలో జరిమానా కూడా విధించింది. ఈనేపథ్యంలో మెట్ట అక్రమాలపైనా ఎన్‌జీటీ ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

823 ఎకరాల్లో.. మింగేశారు!

పెద్దాపురం, గండేపల్లి మండలాల్లో 823 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించి ఉన్నాయి. సర్వే నెంబరు 1 నుంచి 90 వరకు ఉన్న ఈ ప్రాంతాన్ని రామేశ్వరం మెట్టగా పిలుస్తారు. మధ్యలో కొంత ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఇందులో జింకలు, దుప్పిలు, లేళ్ల ఇతర వన్యప్రాణులెన్నో ఉన్నాయి. కాకినాడకు సమీపంలో ఉన్న ఈ కొండలు, గుట్టల్లో నిక్షిప్తమై ఉన్న గ్రావెల్‌పై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి కన్ను పడింది. అంతే రామేశం మెట్టను గుల్ల చేసేశారు. 823 ఎకరాల్లో కొండలను మింగేసి మట్టి/గ్రావెల్ కోసం కొండల కింద భూమిని సైతం లోయలుగా మార్చేశారు. అప్పటి కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి, ఆయన మనుషులు సాగించిన దోపిడీ పర్వం విలువ వందల కోట్లపైనే. అయితే అప్పట్లో సదరు నేతకు భయపడి కలెక్టర్ నుంచి జేసీ వరకు గనుల శాఖ నుంచి రెవెన్యూ శాఖ వరకు అన్నీ సాగిలపడ్డాయి. ఎంత తవ్వుకున్నా కన్నెత్తి చూడ్డానికి భయపడ్డాయి. ఇప్పుడు ఎన్జీటీ కేసు విచారణకు స్వీకరించడంతో వేల కోట్ల కుంభకోణం బట్టబయలయ్యే అవకాశం కనిపిస్తోంది.

అవినీతి.. 'లక్ష'ణాలు!

- కాకినాడలో ఏసీబీకి చిక్కిన జిల్లా రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్..
- గ్యాస్ ఏజెన్సీ యజమాని పేరు మార్పునకు రూ.లక్ష డిమాండ్
- కారులో రూ.7.80 లక్షల నగదు, 13 మద్యం సీసాలు స్వాధీనం

ఆరుగురు విద్యార్థుల అదృశ్యం

- స్కూల్‌కు వెళ్లడం లేదని మందలించారని అలిగి పరారు
- 24న వెళ్లిపోయిన విద్యార్థులు
- 28న పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- రంగంలోకి దిగిన పోలీసులు

5



ట్రాన్స్‌కో అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

79 వేల ఎస్సీ కుటుంబాలకు సోలార్ ప్యానెల్స్ : కలెక్టర్

అమలాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద జిల్లాలో 79వేల షెడ్యూల్డు కులాల కుటుంబాలకు ఏపీ ట్రాన్స్‌కో, బ్యాంకర్ల సమన్వయంతో మూడు నెలల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సూర్యఘర్ పథకానికి అర్హులైనవారి జాబితాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 200లోపు యూనిట్ల విద్యుత్ వాడకం ఉన్న 79 వేల షెడ్యూల్డు కులాల కుటుంబాలను గుర్తించారన్నారు. వీరిలో 23 వేల కుటుంబాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు రూఫ్‌టాప్‌లు ఉన్నాయని, మిగిలిన వారికి ప్రభుత్వ నోటిఫైడ్ స్థలాల్లో సూర్యఘర్ విద్యుత్ సరఫరా ప్లాంట్లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఒక కిలోవాట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీగా అందించగా మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రెండు కిలోవాట్ల వినియోగం ఉన్నవారికి రూ.60 వేల వరకు సబ్సిడీ పొందవచ్చని, మిగిలిన సొమ్మును బ్యాంకు రుణంగా అందిస్తుందన్నారు. అయితే లబ్ధిదారుడు రెండు కిలోవాట్లకు అయ్యే ఖర్చు రూ.1.50 లక్షల్లో 10శాతం అనగా రూ.15 వేలు వాటాగా ముందు చెల్లించాలన్నారు. మిగిలిన సొమ్మును 7 శాతం వడ్డీతో బ్యాంకు రుణంగా మంజూరు చేస్తుందని పదేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. మీటరు బిగించిన వెంటనే కేంద్ర ప్రభుత్వం రాయితీ సొమ్మును ఆయా లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తుందన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాంబాబు, ఎల్డీఎం కేశవవర్మ పాల్గొన్నారు.

ఐదంచెల విద్యా వ్యవస్థ ఏర్పాటు : కలెక్టర్

అమలాపురంటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలకు నాంది పలికిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. దీనిలో భాగంగా ఐదంచెల విద్యావ్యవస్థను వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు. ఇప్పటివరకు ఆరంచెల విద్యావిధానం నడుస్తుందన్నారు. ఐదంచెల విద్యా వ్యవస్థ ఏర్పాటుకు సంబంధిత పాఠశాల టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత విద్యాబోధనలో నాణ్యతను పెంచి అన్ని సౌకర్యాలతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేవిధంగా ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. స్కూలు నిర్వహణ కమిటీలు, తల్లిదండ్రులను ఒప్పించి ఉపాధ్యాయులు త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలన్నారు. సర్వే చర్చల సమావేశాలను ఎంఈవోలు విధిగా వీడియో చిత్రీకరణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో షేక్ సలీంబాషా, ఎంఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

త్యాగానికి, సహనానికి ప్రతీక రంజాన్ : కలెక్టర్



అమలాపురం అబుల్‌కలాంఆజాద్ ముస్లిం షాదీఖానా భవనంలో రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు, ఎస్పీ కృష్ణారావు తదితరులు

ఐదు ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

3 జనసేనకు.. 2 టీడీపీకి

కాకినాడ/అమలాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల జాబితాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్లు చోటుదక్కించుకున్నారు. ఇందులో రెండు టీడీపీకి, మూడు జనసేనకు దక్కాయి. పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి (జనసేన) నియమితులయ్యారు. ఈమె ఎస్సీ మహిళ కేటగిరీ నుంచి ఎంపికైంది. కాకినాడ రూరల్‌లోని కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ (జనసేన), కాకినాడ జిల్లా జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా అడపా భరత్‌బాబు (టీడీపీ) నియమితులయ్యారు. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలో నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెనుమాల లక్ష్మి (జనసేన), మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చింతపల్లి రామకృష్ణ (టీడీపీ) నియమితులయ్యారు. అయితే తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎవరినీ ప్రకటించలేదు.

'పని'లో పనిగా...



ఏ ఎండకు ఆ గొడుగు అంటే ఇదేనేమో... ఎండలు రోజురోజుకీ ముదురుతున్నాయి.... సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు.... అలాగని బయటకి రావడం తప్పదు కదా... ఓ పనికోసం బైక్‌పై రేకు తీసుకెళ్తున్న వీరిద్దరూ ఎండ నుంచి కాపాడకోవడానికి దానినే అడ్డుపెట్టుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్టీవో ఆఫీసు సమీపంలో శుక్రవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పట్టు తప్పిందా... ప్రాణం గోవిందా!



కొంతమంది ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలకు కారణాలవుతున్నారు. కొందరు ఆటోలో నిల్చుని, మరికొంతమంది వెనుక పల్చని ఇనప రేకుపై కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రాణాలు కోల్పోవాల్సిందే. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి జాతీయ రహదారిపై ఇలాంటి ప్రయాణాలు నిత్యకృత్యం. రవాణా, పోలీసు అధికారులు ఇటు చూడండోసారి..

శంఖవరం (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

రాజానగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ బొమ్మూరులో నైపుణ్య శిక్షణ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 150 మందికి లక్ష్యంగా, ఎస్సీ కులాలకు చెందిన పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ కేటగిరిల్లో నైపుణ్య శిక్షణ కల్పిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్‌మెంట్స్ ఏర్పాటు చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు లేదా నేరుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మూడు రోజులలోగా వివరాలు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఝాన్సీ పేర్కొన్నారు.

కాండ్రకోట నూకాలమ్మ జాతర ప్రారంభం



విలసిల్లుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతర

పెద్దాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోటలో కొలువై భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోలాటం, గరగల నృత్యం, మ్యుజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళిక వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

2 నుంచి పీజీ సెట్ మేథమెటిక్స్‌లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి పీజీ సెట్-2025కు మేథమెటిక్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, హెచ్‌వోడీ జి.చంద్రశేఖర్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ మేథమెటిక్స్‌లో శిక్షణ ఉంటుందని, సిలబస్‌లో ముఖ్యమైన టాపిక్స్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉచిత శిక్షణకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల కోసం 94416 86669, 94916 92923 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా వర్సిటీతో జేఎన్టీయూకే ఎంవోయూ



పత్రాలను మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, ఒనిస్కీ

జేఎన్టీయూకే, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని యూనివర్శిటీ ఆఫ్ న్యూకాజిల్ తో కాకినాడ జేఎన్టీయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. వీసీ సమావేశ హాల్లో ఎంవోయూపై ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, యూనివర్శిటీ ఆఫ్ న్యూకాజిల్ ప్రో వీసీ డాక్టర్ అలెగ్జాండర్ ఒనిస్కీతో శుక్రవారం చర్చించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్,మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యార్థులకు యూజీ, పీజీ కోర్సులను అందిస్తుందన్నారు. ఒనిస్కీ మాట్లాడుతూ క్యూఎస్ ప్రపంచ ర్యాంకింగ్‌లో తమ యూనివర్శిటీలోని విభాగాలు ఉత్తమర్యాంకులు కలిగి ఉన్నాయన్నారు. 92శాతం మంది విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎంవోయూకు సుముఖత వ్యక్తంచేశారు.ఎఫ్‌యూఆర్ డైరెక్టర్ స్వర్ణకుమారి, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వీసీ ప్రసాదరాజు, డైరెక్టర్లు బాలకృష్ణ, గోపాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న అంజలి ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఐసీయూలో చికిత్సపొందుతున్న ఫార్మడి ఫైనలియర్ విద్యార్థిని ఎన్.నాగాంజలి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీపక్ తనను మోసం చేశాడనే మనస్తాపంతో అంజలి ఈ నెల 23న మత్తు ఇంజక్షన్ అత్యధిక మోతాదులో తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆరు రోజులుగా ఆమె పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం కూడా ఎటువంటి మార్పు కనిపించలేదని సమాచారం.

ఎండల్లో హాయ్... హాయ్...

- గాలిలో నాణ్యత పెంపునకు మిషన్
- రాజమహేంద్రవరంలోని రద్దీ ప్రాంతాల్లో వినియోగం
- నగర ప్రజలను ఆకర్షిస్తున్న వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ మిషన్



చల్లదనాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణం...



లాలాచెరువు హైవేలో నీటిని స్ప్రే చేస్తున్న మిస్టింగ్ మిషన్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గాలిలో నాణ్యతను పెంపొందించే వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం వీధుల్లో తిప్పుతున్నారు. ఇది వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ఆయా ప్రాంతాలను చల్లబరుస్తుంది. వాహనాలు, పేపరుమిల్లు వాయు కాలుష్యంతో నగర ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చే పరిస్థితి లేదు. దీంతో గాలిలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రూ.47.79 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. దీనిని ఇప్పుడు నగరంలో తిప్పుతున్నారు. ఈ వాహనం వెళ్తున్న క్రమంలో వాటర్ ఆవిరి రూపంలో గాలిలోకి స్ప్రే అవుతుది. దీంతో కాలుష్య నియంత్రణ జరుగుతోంది. అంతేగాక అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కిన ఆ ప్రాంతం ఒక్కసారిగా చల్లబడి ప్రజలు, వాహనచోదకులు సేదదీరుతున్నారు. వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను వాహనాన్ని నగరంలో నిత్యం రద్దీగా వుండే దేవీచౌక్, జైలు రోడ్డు, కోరుకొండ రోడ్డు, కంబాలచెరువు, గోకవరం బస్టాండ్, పుష్కరాల రేవు, గెయిల్ ఆఫీస్ రోడ్డు, ఏవీఏ రోడ్డు, దానవాయిపేట, ప్రకాష్‌నగర్, జేఎన్ రోడ్డుల్లో తిప్పుతున్నారు. వాహనం వెళ్లిన 15 నిమిషాల వరకు ఆ ప్రాంతమంతా చల్లగా ఉంటోంది. మండిపోతున్న ఎండల్లో వాహనచోదకులు, బాటసారులకు కాస్త చల్లదనం పంచుతోంది. ప్రతిరోజు మధ్యాహ్నం పూట ఈ వాహనం నీటిని స్ప్రేయింగ్ చేస్తూ నాణ్యమైన గాలితో పాటు చల్లదనాన్ని అందిస్తోంది.



8వేల లీటర్ల నీటితో గాలిలో స్ప్రేయింగ్

వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనం ద్వారా మంచినీటిని గాలిలోకి చల్లడంతో కాలుష్యం తగ్గుతుంది. ఈ వాహనంలో వినియోగించే నీటిలో క్లోరిన్ తక్కువగా వేసి శుద్ధి చేసిన 8వేల లీటర్లను నింపుతారు. రోజుకు రెండున్నర గంటల పాటు 9.5 కిలోమీటర్ల మేర తిరిగి నీటిని గాలిలో స్ప్రే చేస్తుంది. దీంతో గాలిలోని దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయి. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లేందుకు షెడ్యూల్ తయారు చేశారు. ఈ వాహనంలో డ్రైవర్, ఆపరేటర్ ఉంటారు.



దాట్ల దేవదానం రాజుకు కళారత్న పురస్కారం

యానాం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కళారత్న(హంస) పురస్కారం అందజేస్తున్నట్టు సాంస్కృతికశాఖ డైరెక్టర్, కన్వీనర్ ఆర్.మల్లికార్జునరావు నుంచి సమాచారం అందిందని యానానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు తెలిపారు. ఉగాది సందర్భంగా ఆదివారం జరిగే ప్రత్యేక సభలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా తమ్మిలపల్లి కళాక్షేత్రంలో అందజేయనున్నారు. కథకుడిగా, కవిగా, విమర్శకుడిగా, చరిత్రకారునిగా సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న రాజు పురస్కారం స్వీకరిస్తున్నందుకు కవిసంధ్య అధ్యక్షుడు శిఖామణి తదితరులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ విష్ణువర్ధన్‌కు అదనపు డీఎంఈగా పదోన్నతి



జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అదనపు డీఎంఈగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

నోటిఫికేషన్ రద్దు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరు 30న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, ఎఫ్ఎన్‌వో, శానిటరీ అటెండర్ కం వాచ్‌మెన్ పోస్టులు ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ రద్దు నేపథ్యంలో దరఖాస్తుదారులకు డీడీలు తిరిగి ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయించినట్టు తెలిపారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో వచ్చే నెల 26వరకు డీడీలు తిరిగి ఇస్తామన్నారు. డీడీల కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ నకళ్లు అందించాలని, అప్లికేషన్ నెంబర్ చెప్పాలని తెలిపారు. పోస్టుల రేషనలైజేషన్‌లో భాగంగా నోటిఫికేషన్ రద్దు చేసినట్టు డీఎంహెచ్‌వో చెప్పారు.

గిరిజన విద్యార్థినికి గర్భ నిర్ధారణ పరీక్షలు?

అడ్డతీగల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక పాఠశాలలో అభ్యసిస్తున్న గిరిజన బాలిక గర్భం దాల్చినట్లు విశ్వసనీయ సమాచారం. అల్లూరి జిల్లా అడ్డతీగలలో జరిగిన ఈ సంఘటనపై రంపచోడవరం ఉన్నతాధికారి ఒకరికి ఈ సమాచారం అందడంతో నిజానిజాలు నిర్ధారించడానికి గంగవరం మండలానికి చెందిన మండల స్థాయి అధికారిణిని అడ్డతీగల వెళ్లి సదరు గిరిజన బాలికకు వైద్య పరీక్షలు చేయించి తమకు నివేదిక పంపించాలని ఆదేశించినట్లు సమాచారం. ఆ విద్యార్థినికి అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఈ అంశంపై రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య ఈ వదంతులను ఖండించారు.

భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- వాడపల్లి వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన
- ఫ్లైఓవర్, లైన్లు ప్రారంభం



ఫ్లైఓవర్, లైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఫ్లైఓవర్, క్యూలైన్లను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారించామన్నారు. కూటమి ప్రభుత్వం మాస్టర్ ప్రణాళికలను రూపొందించిందని అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. అనంతరం లైన్లు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులను పరిశీలించి ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుకు పలు సూచనలు చేశారు. కోనేరు, అన్నదాన భవన నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. తొలుతగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆక్రమణలు తొలగించే విషయంలో కొంతమంది వ్యాపారులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి తమ బాధను తెలిపారు. అనంతరం వారందరితో ఆయన చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, యేపుగంటి వెంకటేష్, అల్లు భాస్కరరావు, ఎంవీవీ సత్యనారాయణ, పిండెం వెంకన్న పాల్గొన్నారు.

ఏర్పాట్లపై చర్చించిన ఆర్డీవో

ప్రతి శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఆర్డీవో పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో ఆయన చర్చించారు. లైన్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఏప్రిల్ 7 నుంచి జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన చర్చించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు ఆర్డీవో సమీక్ష చేశారు. మరో విడత వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. ఆర్డీవో వెంట తహశీల్దారు శ్రీధర్, ఎంపీడీవో రామన్, ఎస్‌ఐ రాము ఉన్నారు.

నూకాంబిక జాతర ఉత్సవాలు



కాగడాలు వేస్తున్న భక్తులు, నూకాంబికా అమ్మవారు



ఆలమూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో పేరుగాంచిన అమ్మవారి జాతరలలో ఒకటైన ఆలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అమ్మవారికి చంటి పిల్లల చేత కాగడాలు వేయించడంతోపాటు తుళ్లబిళ్ల, వారపోయుట, కావిడికోళ్లు మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. జాతరలో రంగురంగుల విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలు నిర్వహణ కోసం వివిధ శాఖ అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి ఆయాశాఖల అధికారులు ఉత్సవ ఏర్పాట్లు తహశీల్దార్ ప్రకాష్‌బాబు పర్యవేక్షించారు. పారిశుధ్య ఏర్పాట్లపై ఎంపీడీవో ఎ.రాజు ప్రత్యేక సిబ్బంది నియమించారు. జాతర ఉత్సవాలు సజావుగా జరిగేందుకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ పర్యవేక్షణలో ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ దాదాపు మూడు వందల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఉగాది నాటిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి

సీఆర్సీ అధ్యక్షుడు నాగమోహనరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగమోహన్‌రెడ్డి

రావులపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీలో సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 25వ ఉగాది ఆహ్వాన నాటక పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి తెలిపారు. రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఆర్సీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 31, ఏప్రిల్ 1న నాటికలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. నాటిక పోటీలకు న్యాయనిర్ణేతలుగా సినిరచయిత, సీఆర్సీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ తనికెళ్ల భరణి ఆధ్వర్యంలో, డాక్టర్ కోట శంకరరావు, డాక్టర్ గౌతంరాజు, గుండు సుదర్శన్‌తో పాటు పలువురు వ్యవహరిస్తున్నారన్నారు. నాటక కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి నాటిక పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన ముందుగా శ్రీవిశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలు, బ్రహ్మశ్రీ పెడసనగంటి సీతారామమూర్తి శర్మఅవధానిచే పంచాంగ శ్రవణం అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెద్వేంకు చెందిన శుక్ల యజుర్వేద తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు ఆరాధ్యుల అప్పనసోమయాజికి వేదపండిత సత్కారం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా మేకప్ ఆర్టిస్ట్ అడివి శంకరరావుకు డాక్టర్ తనికెళ్ళ భరణి కాటన్ కళా పురస్కారాన్ని అందజేస్తారన్నారు.

మన ప్రాజెక్టులకు సీఎం ఓకే

- యాక్షన్ ప్లాన్ ప్రకారం లక్ష్యాలు సాధించాలి
- జిల్లా అధికార్లకు 'తూర్పు' కలెక్టర్ ప్రశాంతి దిశానిర్దేశం

రాజమహేంద్రవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): విజన్-2047 లక్ష్య సాధన కోసం మనం జిల్లాలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఇక మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి మండల స్థాయిలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడానికి సిద్ధం కావాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయ, హార్టీకల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ, అధికారులు జీవీఏ వృద్ధి రేటు పెంచేలా తయారు చేసిన నివేదికలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. దీని కోసం క్షేత్రస్థాయిలో ప్రణాళికలను ఆచరించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు పెంచేదిశలో పంటల మార్పిడి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలసాగు, పొలాల గట్లపై అంతర పంటలు, పశువుల దాణా, గడ్డి సాగువంటివాటిపై దృష్టి పెట్టాలన్నారు. మెరుగైన అధిక దిగుబడులను సాధించేలా పంటకు అవసరమైన వత్తనాల పంపిణీ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో దశల వారీగా పంట మార్పిడి విధానాలు అమలు చేయాలన్నారు. హార్టికల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ రంగంలో కూడా ఆవిష్కరణలు ఎక్కువగా ఉండాలని ఆదేశించారు. 100శాతం సాగుభూమిని వినియోగంలో తేవాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ఏడాది 15శాతం వృద్ధి రేటు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని, వాటిని మండలాల వారీ అమలు చేయాలని ప్రశాంతి చెప్పారు. వ్యవసాయంలో 17.57శాతం, హార్టీకల్చర్‌లో 16.33శాతం, పశుసంవర్ధక శాఖలో 19.76శాతం కలిపి వ్యవసాయ అనుబంధ రంగాల్లో 40.62శాతం వృద్ధిరేటు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇండస్ట్రీ అనుబంధ రంగాల్లో 18.01శాతం, పర్యాటక, సేవ,రియల్ ఎస్టేట్, రవాణా రంగాల్లో 41.37శాతం వృద్ధిరేటు సాధించేలా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం
రూ.1.19 కోట్లు


హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1.19,10,887 నగదు, 25 గ్రాముల బంగారం, 512 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 46 డాలర్లు, మలేషియా 15, ఆస్ట్రేలియా 20, యుఏఈ 105 దిరహమ్స్ లభించాయి. 25 రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన రోజుకు రూ.4.76 లక్షలు భక్తులు హుండీల్లో కానుకల రూపంలో సమర్పించుకున్నారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది,సేవాసంస్థ సభ్యులు లెక్కించారు.

పట్టువస్త్రాలు సమర్పణ


పట్టువస్త్రాలు అందిస్తున్న లక్కీషోరూం అధినేతలు

విశ్వావసు నామ ఉగాది పర్వదినం పురస్కరించుకుని విశాఖపట్నం లక్కీషోరూం ప్రతినిధులు శ్రీనివాసరావు, దత్తయ్యలు శుక్రవారం రత్నగిరిపై స్వామి,అమ్మవార్లకు, ఉపాలయాలలో ఉన్న సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. వాటిని ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నసత్ర సమాజం అధ్యక్షుడు పేరూరి గాంధీ పలువురున్నారు.

సీతారాముల కల్యాణానికి...

అన్నవరం ఆలయ క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాలు సందర్భంగా విశాఖపట్నంకు చెందిన మల్లెల వీరరాఘవరావు, దువ్వ గ్రామానికి చెందిన కాశీ పట్టువస్త్రాలను దేవస్థానం అధికారులకు అందించగా దాతలను ఆయన అభినందించారు.

రూ.10 లక్షల విరాళం


రూ.10లక్షల విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీకి శుక్రవారం ఒక దాత రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా పేరు చెప్పడానికి ఇష్టపడని రాజమండ్రికి చెందిన దాతను ఈవో అభినందించారు.

అమ్మ,నాన్నలు మందలించారని
ఆరుగురు విద్యార్థుల అదృశ్యం


విద్యార్థులు పృథ్వీవర్మ, కరుణ, పండు, సంతోష్, సతీష్, మాధురి

- ఆలమూరులో వెలుగులోకి వచ్చిన ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ఆలమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌కు సక్రమంగా వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఆరుగురు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన ఆలమూరులో వెలుగులోనికి వచ్చింది. డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఖండ్రిగలోని యానాదుల పేటకు చెందిన విద్యార్థులైన నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఈనెల 24న రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటి నుంచి పరారయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టి ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలమూరు యానాదులపేటలో కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగించే ఐదు కుటుంబాలకు చెందిన కొమరగిరి పృథ్వీవర్మ (12) 6వ తరగతి, కొమరగిరి కరుణ(14) 8వ తరగతి, గంధం సత్యనారాయణ(13) 8వ తరగతి, మరి సంతోష్(14) 7వ తరగతి, కొమరగిరి పండు (12) 6వ తరగతి, రామచంద్రపురానికి చెందిన కొమరగిరి మాధురి(12) 7వ తరగతి చదువుతున్నారు. కొమరగిరి కరుణ ఆలమూరు బొబ్బా జయశ్రీ గరల్స్ హైస్కూల్‌లో చదువుతుండగా పృథ్వీవర్మ, సత్యనారాణ, సంతోష్, పండులు కొత్తూరు సెంటర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. మధురి రామచంద్రపురంలో చదువుతుండగా 4రోజుల క్రితం ఆలమూరుకు తన చిన్నమ్మ ఇంటికి వచ్చింది. ఈ ఆరుగురు ఈనెల 24న రాత్రి 7గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి స్థానిక వినాయక గుడి సెంటర్ నుంచి వెళ్లినట్టు పోలీసులు సేకరించిన సమాచారం మేరకు తెలుస్తుంది.

ఒకే కాలనీ వాసులు

అదృశ్యమైనవారంతాఆలమూరులోని యానాదులపేటకు చెందినవారు. ఇక్కడ దాదాపు 50 కుటుంబాలు కూలీపనులు, చేపలవేట తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. పిల్లలను స్కూల్‌కు పంపించి తల్లిదండ్రులు పనులకు వెళ్లడం జరుగుతుంది. అయితే వారిపై సక్రమైన అజమాయిషీ లేకపోవడంతో స్కూల్‌కు వెళ్లడం లేదు. దీంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వారిని మందలించడం జరిగింది. దీంతో అలిగి ఇంటి నుంచి పరారైనట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లిదండ్రులు వివరించారు.

ఆచూకీ కోసం ప్రత్యేక బృందం

ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఆలమూరు ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో సీసీ ఫుటేజ్‌లను సేకరించే చర్యలు చేపట్టారు.

కర్రతో కొట్టి.. ఎండలో మోకాలి కుర్చీ వేయించి!

- విద్యార్థినిపై హిందీ టీచరు దాష్టీకం
- సొమ్మసిల్లి ఆసుపత్రిలో చేరిన వైనం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరి

సామర్లకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.మహేశ్వరి చేతులపై హిందీ టీచరు భారతిలక్ష్మి తీవ్రంగా కర్రతో కొట్టడమే గాక ఆరుబయట ఎండలో మోకాలి కుర్చీ వేయించడంతో బాలిక సొమ్మసిల్లి పడిపోగా సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం సాయంత్రం చేర్పించారు. పాఠశాల ప్రధానోధ్యాయురాలు పదోతరగతి పరీక్షల పేపర్లు అప్పగించేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. తల్లి తండ్రులు కౌన్సిలరు సత్యనారాయణ సాయంతో బాలికను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.

అవినీతి.. 'లక్ష'ణాలు!

మొన్న పిఠాపురం రూరల్ ఎస్ఐ.. నేడు కాకినాడ జిల్లా సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్.. వరుసగా అవినీతి ముసుగు వేసుకున్న లంచావతరాల గుట్టు బయటపడడం కాకినాడ జిల్లాలో సంచలనమైంది.

- కాకినాడలో ఏసీబీకి చిక్కిన జిల్లా రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్..
- గ్యాస్ ఏజెన్సీ యజమాని పేరు మార్పునకు రూ.లక్ష డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన ఏజెన్సీ యజమాని
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఇటీవల ఏసీబీకి చిక్కిన పిఠాపురం రూరల్ ఎస్ఐ


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నగదు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొన్నటికి మొన్న ఏసీబీ వలకు పోలీసు అవినీతి తిమింగలం చిక్కింది.. తాను ప్రైవేటుగా పెట్టుకున్న డ్రైవర్ ద్వారా రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్ఐ ఎల్.గుణశేఖర్ ఈ నెల 24వ తేదీ రాత్రి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకే మరో భారీ అవినీతి తిమింగలం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల వలకు పట్టుబడింది. కాకినాడ జిల్లాలో నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ఈ వరుస ఘటనలు కలకలం రేపుతున్నాయి. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన కొందరు లంచాలు డిమాండ్ చేస్తూ ఏసీబీ అధికారులకు వరుసగా పట్టుబడడం సంచలనమైంది.

భారీ అవినీతి తిమింగలం..

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ అనగానే ఆదాయం భారీగా ఉంటుంది. జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడికి వివిధ పనుల నిమిత్తం క్రయవిక్రయదారులు అధికంగా వస్తుంటారు. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, సబ్ రిజిస్ట్రార్‌లు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక్కడ డాక్యుమెంట్ రైటర్లు కూడా ఎక్కువే. నిత్యం వీరంతా కార్యాలయంలోనే నేరుగా తమ పనులు చక్కబెట్టుకుంటారు. మరోవైపు సిబ్బంది కూడా చాలామంది ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేశారు. అవినీతికి అలవాటు పడ్డారు. రోజువారీ టార్గెట్లు పెట్టుకుని చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇక జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు విషయానికొస్తే.. ఈయన సొసైటీ, ఫర్మ్, ఎడిట్ ఇండెక్స్(తప్పుల సవరణ, పోస్టు ఫ్యాక్టో పనులు, పవర్ వాల్యూయేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తనిఖీ ఈయన పని.. జిల్లాలోనే ఆయన గత కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆడిట్ అండ్ మార్కెట్ రిజిస్ట్రార్‌గా రెండేళ్లపాటు కాకినాడలో పనిచేశారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీపై రాజమండ్రి వెళ్లిపోయారు... 2024 ఆగస్టులో బదిలీపై తిరిగి కాకినాడ వచ్చారు.

రూ.లక్ష డిమాండ్ చేసిన రిజిస్ట్రార్..

తన భార్య పేరున ఉన్న గ్యాస్ ఏజెన్సీని తన పేరున పార్టనర్ షిప్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ వచ్చిన తునికి చెందిన ఆర్.రమేష్‌బాబు నుంచి రూ.లక్ష డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కాడు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు. ఆయనతో పాటు మరో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తునికి చెందిన ఆర్.రమేష్‌బాబు తన భార్య పేరున ఉన్న సమతా గ్యాస్ ఏజెన్సీని కొన్ని కారణాలతో తన పేరున మార్చుకోవాలని, పార్టనర్‌షిప్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకుగాను జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావును ఆశ్రయించాడు. ఆ పని చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని ఆనందరావు డిమాండ్ చేశాడు. 15 రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండగా రమేష్‌బాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన రమేష్‌బాబు లంచం సొమ్మును ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆనందరావు నుంచి రూ.లక్ష, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి నుంచి రూ.25 వేలు, అనధికారికంగా ఉన్న మరో రూ.85వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు తెలిపారు.

కారులో నగదు, ఖరీదైన మద్యం సీసాలు, స్వాధీనం

ఏసీబీకి పట్టుబడిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావును ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రి విచారించారు. ఆయన కారులో సుమారు రూ.7.80లక్షల నగదు, ఖరీదైన 13 మద్యం సీసాలను గుర్తించారు. వీటిని కాకినాడ ఇంద్రపాలెంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఆనందరావుపై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనకు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరంల్లో భారీ భవంతులు ఉన్నట్టు సమాచారం.

డిప్యూటీ సీఎం ఇలాకాలో...

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మండలం దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ రూరల్ ఎస్ఐ గుణశేఖర్, అతడి పోలీసు వాహనంపై ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ ఏసీబీ అధికారులకు చిక్కారు. 2024 అక్టోబర్ నెలలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో జిల్లా స్థాయి అధికారుల విచారణ అనంతరం పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, గంగరాజులను నిర్దోషులుగా గుర్తించారు. వారి పేర్లను కేసు నుంచి తొలగించేందుకు రూరల్ ఎస్ఐ గుణశేఖర్ లంచడం డిమాండ్ చేసి 20 రోజులుగా తిప్పుతున్నారు. బేరసారాల అనంతరం రూ.20 వేలకు అంగీకారం తెలిపి.. ఆ సొమ్ము తీసుకుంటుండగా గుణశేఖర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డిప్యూటీ సీఎం ఇలాకాలో జరిగిన ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. అయితే దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే నేరస్తులతో పాటు వారికి అండగా ఉండే నాయకులు, పోలీసులను ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతల అంశంపై అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు పోలీసు స్టేషన్లలో పరిస్థితిపై ఇంటిలిజెన్స్ నివేదిక తీసుకోవాలని ఆదేశించారు.

పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతి


మృతిచెందిన వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతిచెందాడు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురం రామారావుపేటకు చెందిన దోనిపాటి వెంకటేశ్వరరావు(44) అదే గ్రామంలో ఒక రైతు పొలంలో కొబ్బరికాయలు పోగు చేస్తుండగా తాచుపాము కాటు వేసింది. అతడిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతడికి భార్య కనకలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముమ్మిడివరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీబీ స్వామి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

మరోచోట యువతి...


మరణించిన శృతిప్రియ

మామిడికుదురు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన కంచి శృతిప్రియ (24) పాము కాటుకు గురై గురువారం మృతిచెందింది. ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతున్న సమయంలో శృతిప్రియ పాముకాటుకు గురవ్వడంతో ఆమెను కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మరణించింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ కేసు నమోదు చేశారు.

మోటార్‌సైకిల్ ఢీకొని కల్లుగీత కార్మికుడి మృతి

గొల్లప్రోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కల్లు గీత కార్మికుడు మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు గుత్తుర్తి అప్పారావు(65) సైకిల్‌పై ఏపీ మల్లవరం బయలుదేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొనడంతో అప్పారావుకు తీవ్రగాయాలయ్యాయి. తొలుత పిఠాపురం, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. అప్పారావు కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి 31న జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు చేసి నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా శుక్రవారం తెలిపారు. 31వ తేదీన రంజాన్ సెలవు దినం కావడం వల్ల ఆ రోజు జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ 1వ తేదీకి మార్పు చేసినట్టు తెలిపారు. పరీక్షా తేదీ మార్పును పరీక్షా సిబ్బంది, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించి విద్యార్థులకు తెలియచేయాల్సిందిగా సూచించారు.

ఆగిన అంతిమయాత్ర!

- బాణసంచా పేల్చడంతో హఠాత్తుగా తేనెటీగల దాడి
- మృతదేహాన్ని వదిలి పరుగులు పెట్టిన కుటుంబ సభ్యులు, బంధువులు
- 26 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం
- రహదారిపైనే రెండుగంటల పాటు మృతదేహం


రహదారిపై ఉండి పోయిన వృద్ధురాలి మృతదేహం


గాయపడ్డ వారికి పీహెచ్‌సీలో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఎటపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊరేగింపుగా బాణసంచా కాలుస్తూ దహన సంస్కారాలు నిర్వ హించేందుకు అంతిమయాత్రగా వెళ్తన్నారు. అ యితే బాణసంచా కాల్పుల అలికిడికి తేనే తుట్ట కదిలి అంతిమయాత్రలో పాల్గొన్న వారిపై ఒక్క సారిగా దాడిచేశాయి. దీంతో వారు మృతదేహా న్ని అక్కడే వదిలి పెట్టి ప్రాణభయంతో పరుగులు తీశారు. దాంతో అంతిమయాత్ర ఆగిపోయిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం గన్నేరుకొయ్యపాడు గ్రామంలో జరి గింది. గన్నేరుకొయ్యపాడు గ్రామానికి చెందిన కొప్పుల పల్లమ్మ (82) గురువారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం అంతిమయాత్రని ర్వహించారు. అయితే ఇందులో భాగంగా రెండు సార్లు (దింపుడుకళ్లం) మృతదేహాన్ని కిందకు దించుతారు. గన్నేరుకొయ్యపాడు గ్రామంలో 3 రహదారుల జంక్షన్ వద్ద మృతదేహాన్ని పాడి మీద నుంచి కిందికి దింపి బాణసంచా కాల్పుల ంతో చెట్టుపై తేనేపట్టుతో ఉన్న తేనెటీగలు అం తిమయాత్రలో పాల్గొన్నవారిపై దాడి చేశాయి. దాంతో అక్కడ ఉన్న సుమారు 70 మంది తలో దిక్కుకు పరు గులు తీశారు. 100పైగా తేనేటీగ లు మూకుమ్మడిగా దాడి చేశాయి. ముగడ చంద్రశేఖర్ అనే వ్యక్తి స్పృహ కోల్పోయాడు. కొందరు నీటి డమ్ముల్లో దాక్కున్నారు. మరికొందరు ఇళ్లలోకి పరుగులు పెట్టారు. 26 మంది గాయపడ్డారు. వెంటనే సమీపంలోని గౌరిదేవి పేట పీహెచ్‌సీకి వెళ్లడంతో ఇద్దరు వైద్యులు, సిబ్బంది గాయపడ్డ వారి శరీరంపై తేనే టీగల ముళ్లను తొలగిం చారు. దాంతో వారికి ప్రాణా పాయం తప్పింది. ముగడా చంద్రశేఖర్, కొప్పుల వెంకటేశ్వరావు, ముత్యాల నరేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి పాల వడంతో పల్లమ్మ అంతిమయాత్ర ఆగిపోయి మండుటెండలో మృ తదేహం రహదారిపై 2 గంటల పాటు ఉండి పోయింది. తేనెటీగలు ఇంకా చుట్టుముట్టి ఉన్నాయన్న భయంతో మృతదేహం వద్దకు వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. తర్వాత మృతదేహాన్ని ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

కొత్త దుస్తులు కొన్నా.. కళ్లు తెరమ్మా!

- కాలువలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి
- తట్టుకోలేక విలవిల్లాడిన తల్లి


విలపిస్తున్న అనూషా భార్గవి తల్లి, బంధువులు


భార్గవి (ఫైల్‌ఫొటో)

అనపర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో పుట్టినరోజు జరుపుకోవలసిన చిన్నారిని కాలువ రూపంలో మృత్యువు కబళించింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని నల్లకాలువలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతిచెందింది. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన మచ్చ అనూషాభార్గవి (4) అదృశ్యమైంది. తల్లిదండ్రులు దొరబాబు, భవానీ వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో సిబ్బంది పాప నివాసం ఉండే సమీపంలోని కాలువ వెంబడి గాలింపు చేపట్టగా సాయంత్రం చింతపల్లి లాకుల వద్ద పాప మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పాప ఆడుకుంటూ కాలువలోకి జారి పడి ఉంటుందని భావిస్తున్నట్టు సీఐ తెలిపారు. మే నెల 28న పుట్టినరోజు జరుపుకునేందుకు చిన్నారికి కొత్త దుస్తులు కూడా కొన్నానని, తాను ఇప్పుడు ఎవరికి పుట్టినరోజు ఎవరికి చేయాలంటూ చిన్నారి తల్లి భవాని రోదనలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చిన్నారి మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసుకువస్తున్న సీఐ సుమంత్

వేసవిలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఐ.పోలవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు మురమళ్ళ వీరేశ్వర స్వామి ఆలయసహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, మజ్జిగ చలివేంద్రాలు, క్యాయర్ మ్యాట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

అల్లవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరపాలని కులవివక్ష పోరాట సంఘం జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కేఎల్ భాస్కర్, వడ్డి మోహనరావు, బొంతు సుబ్బారావు, నూకపెయ్యి తారకరామారావు, గోసంగి ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేస్తా : ఎమ్మెల్యే దేవ


మహిళకు నీళ్ల బిందెను అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండలంలో రూ.1.53కోట్లతో గుడిమెళ్లంక, మట్టపర్రు, బట్టేలంక, తూర్పుపాలెం గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటీ అమలు చేస్తున్నామన్నారు. రాజోలు నియోజకవర్గంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, తీర ప్రాంతాల్లో ఈసమస్య మరింత జటిలంగా ఉందని, పక్కా ప్రణాళికతో వెళితే ఈసమస్య పరిష్కారమవుతుందన్నారు. గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందన్నారు. 26వాటర్ ట్యాంకులు రాజోలు నియోజకవర్గానికి మంజూరు కాగా 19వాటర్ ట్యాంకులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మిగిలిన ఏడు ట్యాంకులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రతీ ఇంటికీ కుళాయి ఇవ్వాలన్నదే తన లక్ష్యమన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించడం ద్వారా మరింత సమర్థవంతంగా ప్రతీ గ్రామానికి మంచినీరు అందించవచ్చని దానికి అనుగుణంగా నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమాల్లో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల యుగంధర్, దిరిశాల బాలాజీ, మంగెన భూదేవి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, మేడిచర్ల సత్తిబాబు, సర్పంచ్‌లు రాపాక విజయకుమారి, కడలి దుర్గాదేవి, బోనం సీతారత్నం, గుర్లింక సత్తిబాబు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

త్యాగానికి.. సహనానికి.. ప్రతీక రంజాన్

కలెక్టర్ మహేష్‌కుమార్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు తదితరులు

అమలాపురం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పండుగ త్యాగానికి.. సహనానికి.. ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అమలాపురం అబుల్ కలాం ఆజాద్ ముస్లిం షాధిఖానా భవనంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత, ప్రేమ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే పర్వదినమన్నారు. నెల రోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారని, రంజాన్ మాసం పవిత్రతను ఆయన వివరించారు. ఈమాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలను పెంపొందిస్తుందన్నారు. నమాజులో పఠించే ఖురాన్ సూక్తులు దైవ ఆదేశాలకు అనుగుణమైన జీవితం గడిపేందుకు ఎలా ఉపకరిస్తాయో రంజాన్ ఉపవాసాలు సైతం మనిషిలో మనోనిగ్రహం, సహనం, ధైర్యం, దాతృత్వం పెంపొందిస్తాయన్నారు. పండుగలు జీవన స్రవంతిలో భాగమైన జాతియతకు, సంస్కృతి వికాసానికి దోహద పడతాయన్నారు. ఇఫ్తార్ విందు, ప్రత్యేక ప్రార్థనల్లో అమలాపురం అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి సునీల్‌కుమార్ మత గురువులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు


నూతన డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రూపొందించిన నూతన డైరీని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బోసుబాబు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేసేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన డి.వేణుమాధవరావును బోసుబాబు ఆధ్వర్యంలో ఏఈవోలు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ అధ్యక్షుడు సీహెచ్ నాగరాజు, కోశాధికారి ఎం.నాగేశ్వరరావులతో పాటు ఎం.శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, శివమోహన్, దుర్గారావు, గంగాభవానీ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పుంగనూరు ఆవు దూడ



మామిడికుదురు,మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈదరాడ గ్రామంలో 16 అంగుళాల ఎత్తుగల పుంగనూరు జాతి పెయ్యదూడ ఆకట్టుకుంటుంది. గ్రామానికి చెందిన తమ్మా లక్ష్మీనరసింహశాస్త్రి ఇంట్లో ఒంగోలు జాతి ఆవుకు పుట్టిన 16 అంగుళాల ఎత్తు గల ఈ పుంగనూరు ఆవుదూడను చూడడానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. తమ ఆవుకు రెండో ఈతగా ఈ బుల్లి పుంగనూరు ఆవుదూడ జన్మించిందని ఆవు యజమాని తెలిపారు.

నగరం మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా లక్ష్మి



మామిడికుదురు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ మొగలికుదురు గ్రామానికి చెందిన పెనుమాల లక్ష్మిని నియమించారు. ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి శుక్రవారం వెలువడ్డాయి. జనసేనకు చెందిన ఆమె వీర మహిళగా పార్టీలో గుర్తింపు పొందడంతో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సిఫార్సు మేరకు లక్ష్మిని ఏఎంసీ ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. లక్ష్మిని పలువురు అభినందించారు.

ఇంటింటా జ్వరాలపై సర్వే నిర్వహించాలి


డెంగ్యూ వచ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

అంబాజీపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వచ్చిన ప్రాంతంలో ఇంటింటా జ్వరాలపై సర్వే నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం దంగేటివారిపాలెంలో డెంగ్యూ నిర్ధారణ అయిన ప్రాంతంలో ఆయన సీహెచ్‌వో బి.అప్పారావుతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, కార్యదర్శి మౌనిక ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో దోమల నివారణకు ఎబేట్ మందు, ముగ్గు, బ్లీచింగ్, పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దంగేటివారిపాలెం ప్రాంతంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నివాస ప్రాంతాల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం డెంగ్యూ వచ్చిన రాయుడుపద్మ, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మురుగునిల్వ ప్రాంతంలో నీటి నిల్వలను పరిశీలించి లార్వా ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో చూపించారు. హెల్త్‌అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర



మామిడికుదురు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గ్రామదేవత నూకాలమ్మవారి జాతరను గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారే వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతరలో బుట్ట బొమ్మలు, తమిళనాడు తంబోళం డప్పులు, కాళికా, శక్తివేషాలు, కేరళ వాయిద్యాలతో పాటు తెలంగాణ బోనాల డ్యాన్సులు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయం నుంచి స్థానిక శివాలయం వరకు నిర్వహించిన పూజ గరగ ఊరేగింపు భక్తులను గగుర్పాటుకు గురి చేసింది. అనంతరం నృత్య కళాకారులు చేసిన గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో నూకాలమ్మవారిని గురువారం రాత్రి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారికి భక్తులు చలిమిడి పానకాలు, పొన్నులు, నైవేద్యాలు సమర్పించారు.

బ్రాంజ్ మెడల్ సాధించిన డిగ్రీ కళాశాల విద్యార్థి

రాజోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద సుబార్తి యూనివర్శిటీ మీరట్ ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 20నుంచి 25వరకు నిర్వహించిన కిక్ బాక్సింగ్ ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీ విభాగాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతోన్న బి.మోహన్‌రాజు పోయింట్ ఫైట్ విభాగం కేటగిరి 75 కిలోల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడని ప్రిన్సిపాల్ సాయిబాబు తెలిపారు. అలాగే మహిళా విభాగంలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోన్న యు.రోహిణి 70కిలోల విభాగంలో ప్రాతినిథ్యం వహించిందన్నారు. మోహన్ రాజును డాక్టర్ సాయిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం తదితరులు అభినందించారు.

డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి


ఆర్టీసీ డిపో గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఎన్ఎంయూ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

అమలాపురం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై విధించిన అక్రమ సస్పెన్షన్లను ఎత్తి వేయాలని డిమాండ్‌చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ జోనల్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ సంఘీభావం తెలిపింది. అమలాపురం డిపోలో 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 33వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎండీ ఔలియా, జి.రాంబాబు, వైవీ రావు, జేఎన్ రావు, ఎంఏ స్వామి, పీఎస్ మన్యం, ఎంఎస్ మన్యం పాల్గొన్నారు. 39వ రోజు నిర్వహించిన గేట్ మీటింగ్‌లో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె.రంగప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు మాట్లాడుతూ డ్రైవర్లను బలవంతంగా టిమ్ డ్యూటీలకు పంపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ డిపోలో మౌళిక సదుపాయాలుకల్పించడంతో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. 39రోజులుగా నిరసన తెలుపుతున్నా యాజమాన్యంలో చలనం లేకుండా పోయిందన్నారు. యూనియన్ ఉప కార్యదర్శి కె.బీమేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు.

పది పరీక్షలు జిల్లాలో ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 110 పరీక్షా కేంద్రాల్లో బయోలాజికల్ సైన్స్ పరీక్షకు సంబంధించి 19,133మంది హాజరు కావాల్సి ఉండగా 19,015హాజరయ్యారు. 99.38 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 118 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 9,513 మందికిగాను 9,445 మంది (99.29) హాజరుకాగా 68 మంది గైర్హాజరయ్యారు. బాలికలు 9,620 మందికి 9,570 మంది హాజరుకాగా (99.48) 50 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఒక కేంద్రాన్ని, జిల్లా పరీక్షల పరిశీలనాధికారి మువ్వా రామలింగం మూడు కేంద్రాలు, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా మూడు పరీక్షా కేంద్రాలు, డీవైఈవో జి.సూర్యప్రకాశం మూడు పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు పరీక్షా కేంద్రాలు, వీవోలు ఐదు పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించామని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. రంజాన్ కారణంగా ఈనెల31న జరగాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహిస్తారు.

ముగిసిన పెద్దింట్లమ్మ ఉత్సవాలు



అంతర్వేది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెంలో వెలసి ఉన్న శ్రీపెద్దింటమ్మవారి ఉత్సవాలు నెలరోజుల పాటు దేవదాయశాఖ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. పోలీసు, రెవెన్యూ, స్థానిక గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతంచేశామన్నారు. సుదూర ప్రాంతాల భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించామని తెలిపారు. నెల రోజుల పాటు శ్రీ పెద్దింట్లమ్మవారిని 5లక్షల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదివారం ఉగాది పర్వదినాన అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

టిడ్కో ఇళ్ల అప్పగింత సమస్యలపై సీపీఎం ఆందోళన


బోడసకుర్రు టిడ్కో ఇళ్ల వద్ద మాట్లాడుతున్న సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అల్లవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల సమస్యలు, లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింతలో జాప్యంపై సీపీఎం రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో సీపీఎం ప్రజాచైతన్య సైకిల్ యాత్ర బోడసకుర్రు టిడ్కో ఇళ్ల వద్ద ముగించి కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని, ఇప్పటికి 90శాతం ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు పూర్తి సబ్సిడీ ఇచ్చి ఇళ్లు అందరికీ స్వాధీనం చేయాలన్నారు. టిడ్కో లబ్ధిదారుల నుంచి బ్యాంకులు బలవంతపు వసూళ్లు ఆపాలని, టిడ్కో రుణమాఫీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సీపీఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరామ్, ఆంధ్ర మాల్యాద్రి, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, ఎం.బలరామ్, టి.నాగవరలక్ష్మి, కె.కృష్ణవేణి, పీతల రామచంద్రరావు తదితరులు శ్రీనివాసరావు వెంట ప్రజాచైతన్య సైకిల్ యాత్రలో పాల్గొన్నారు.

సారా తయారీ, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

పి.గన్నవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీ, విక్రయాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ హెచ్చరించారు. పోతవరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద సర్పంచ్ వడలి కొండయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సారా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాటు సారా తయారీ మానేస్తే డీఆర్‌డీఏ పీడీ ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. కొత్తపేట ఎక్సైజ్ సీఐ కాత్యాయని మాట్లాడుతూ సారా విక్రయిస్తూ, తయారు చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్‌ఫ్రీ నెంబరు 14405 పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.రామచంద్రం, పంచాయతీ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, వీఆర్వో పద్మావతి, ఎఎస్ఐ ఎన్.పట్టాభిరామయ్య, మహిళా పోలీస్ పీఎం సుధా, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, డ్వాక్రా సంఘ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ నరమేధానికి షియా ముస్లింల నిరసన

అమలాపురం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాలో నరమేధం చేస్తున్న ఇజ్రాయిల్, అమెరికా దేశాల తీరును నిరసిస్తూ షియా ముస్లింలు శుక్రవారం అమలాపురంలో నిరసన తెలిపారు. స్థానిక 12వ వార్డులోని పీర్ల పంజా నుంచి షియా ముస్లింలు ఇజ్రాయిల్ నరమేధాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. పాలస్తీనాను దురాక్రమణ చేస్తూ ప్రజలను చిత్రహింసలకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఖుద్స్‌డే నిర్వహించారు. ప్రార్థనల అనంతరం చేపట్టిన నిరసన ర్యాలీలో కమిటీ అధ్యక్షుడు మహ్మద్ నిస్సార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్‌హుస్సేన్, మతగురువు హైదర్‌అలీ తదితరులు పాల్గొన్నారు. ఇజ్రాయిల్ రాక్షస పాలన అంతమవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలంటూ నినాదాలు చేశారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



అమలాపురంటౌన్, మార్చి28(ఆంధ్రజ్యోతి):ఉచిత మెగా డీఎస్సీ-2024 ఆన్‌లైన్ శిక్షణ తరగతులకు అర్హులైన బీసీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి పి.సత్యరమేష్ తెలిపారు. ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తారన్నారు. జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ(ఈడబ్ల్యుఎస్) అభ్యర్థులు టెట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలన్నారు. టెట్‌లో అత్యధిక మార్కులు పొందిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం లభిస్తుందన్నారు. బయోడేటా, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, టీటీసీ, టెట్ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 7093401225ను సంప్రదించాలన్నారు.

'డంపింగ్ యార్డు ఏర్పాటుచేస్తే ఎన్నికలు బహిష్కరిస్తాం'

యానాం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ (పవర్ గ్రిడ్) వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటుచేస్తే సహించేది లేదని గ్రామస్తులు చేస్తున్న ఆందోళన ఎనిమిదో రోజుకు చేరింది. డంపింగ్ యార్డుకు తాము పూర్తిగా వ్యతిరేకం కాదని, ప్రజలకు ఇబ్బందులు లేని చోట ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి చెత్తను ఇక్కడ వేయకుండా నిలుపుదుల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా యానాం మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో గోపాల్‌నగర్ సమీప గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతు ఈప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు ఎట్టిపరిస్థిల్లో ఒప్పుకునేది లేదన్నారు. యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను సైతం బహిష్కరిస్తామని ప్రజలు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మామిడికుదురు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియా ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఇంగువ ఏడుకొండలు (50) మృతిచెందాడు. పాలకొల్లు నుంచి అప్పనపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుకభాగం ఏడుకొండలు మోటారుసైకిల్‌కు తగలడంతో అతను కింద పడిపోయినట్టు స్థానికులు తెలిపారు. కింద పడిపోయిన వ్యక్తిపై బస్సు వెనుకభాగం వెళ్లిపోవడంతో అతడి తల నుజ్జునుజ్జు అయింది. దీనిపై నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

యానాం,మార్చి 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్‌స్పోర్ట్స్) యానాం సెంటార్ ఇంచార్జ్ ఎస్.ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో సాయ్‌స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సెంటార్ ఇంచార్జ్ ఎస్.ఉదయ్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు. మీడియా మిత్రులతో పాటు సాయ్‌స్పోర్ట్స్ క్రీడాకారులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సాయ్ కోచ్‌లు ఎన్.రాజేష్, జి.రవితేజ, భద్ర, దత్తు, నాగరాజు, పోశయ్య, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దహనం చేసిన అంగన్వాడీ టీచర్లు

ఉప్పలగుప్తం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచేశారంటూ అంగన్వాడీ టీచర్లు మండిపడ్డారు. పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉప్పలగుప్తంలో సీఐటీయూ నాయకురాలు బేబీ గంగారత్నం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు మంటల్లో వేసి దహనం చేశారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు పెంచిన విద్యుత్ చార్జీలు భారంగా మారాయంటూ వ్యాఖ్యానించారు. అంగన్వాడీ టీచర్లు కె.మరియమ్మ, జె.భద్రకాళి, ఎస్.సుబ్బలక్ష్మి, పి.పరిపూర్ణ పాల్గొన్నారు.

యల్లాప్రగడ జీవిత చరిత్రపై సెమినార్

ఐ.పోలవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత వైద్యఆరోగ్య శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు జీవిత చరిత్రపై శుక్రవారం గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ స్కూలు వద్ద సెమినార్ జరిగింది. ఏప్రిల్ 7న నిర్వహించే ప్రపంచ ఆరోగ్య దినోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో యల్లాప్రగడ జీవిత చరిత్ర చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు, పీఎంపీ అండ్ ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు రెల్లు గంగాధరం, ప్రిన్సిపాల్ మాగాపు సీతారత్నం, నాటి ధనరాజు, బొమ్మిడి నాగేంద్రవర్మ, పి.ప్రశాంతి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఐటీడీపీ కన్వీనర్ రాజేష్ మృతి



ఉప్పలగుప్తం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ మండల కన్వీనర్‌గా ఉన్న ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువుకు చెందిన మధుర రాజేష్(26) విద్యుత్ షాక్ కారణంగా శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ కి తరలించగా అప్పటికే రాజేష్ మృతి చెందినట్టు ధ్రువీకరించారు. అనంతరం అమలాపురం ఆసుపత్రికి తరలించారు. అతడి తండ్రి నరసింహమూర్తి ఉప్పలగుప్తం తెలుగుదేశం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సమాచారం తెలుసుకున్న అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కన్నీటి పర్యంతమయ్యారు. ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రామరాజులంకలో సొసైటీ మహాసభ

మలికిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రామరాజులంక వ్యవసాయ పరపతి సంఘం మహాసభ పర్సన్ ఇన్‌చార్జి గుబ్బల మురళీసత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. రూ.8.50కోట్ల రుణాలు ఇచ్చామని, రూ.6.39కోట్లు డిపాజిట్ల రూపంలో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ దేశినీడి ఉదయభాస్కరరావు, చొప్పల రాజేశ్వరరావు, మేడిచర్ల వెంకట్రాజు, ముత్యాల దొర తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల జీవనోపాధికి శిక్షణ

అమలాపురం రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు అవసరమైన జీవనోపాధులు, రుణాలను కల్పించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్టు వెలుగు ఏపీఎం అయితాబత్తుల సురేంద్రబాబు తెలిపారు. బండారులంక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధి కోసం రుణ ప్రణాళిక తయారు చేస్తామని ఆయన తెలిపారు. విద్యాధికులను ఎన్యూమరేటర్లగా నియమించి సంఘ సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా కుటుంబ అవసరాలకు కావాల్సిన రుణ ప్రణాళిక తయారు చేస్తారన్నారు. అందుకు అవసరమైన అనేక అంశాలపై ఎన్యూరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామని చెప్పారు. శిక్షణలో వెలుగు సీసీలు రమేష్, దుర్గాకుమారి, వీవోఏలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

అయినవిల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో అవసరమైన జీవనోపాధులు కల్పించడం, రుణాలు ఇవ్వడం తదితర అంశాలపై వెలుగు సెర్ప్ మండల ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సమాఖ్య సహాయకులు, ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఏప్రిల్ 1 నుంచి 7వరకు క్షేత్రస్థాయిలో సంఘ సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా కుటుంబ అవసరాలకు కావాల్సిన రుణ ప్రణాళిక తయారు చేస్తారన్నారు. శిక్షణ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.సత్యాదేవి, కార్యదర్శి పి.సత్యవతి, కోశాధికారి పి.ప్రశాంతి, వెంకటలక్ష్మి, గంగాభవానీ పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లు, వీవోఏలకు శిక్షణ

రాజోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 25025-26 ఆర్థిక సంవత్సరానికి సంఘ సభ్యుల జీవనోపాధుల ఏర్పాటుకు రుణ ప్రణాళిక తయారు చేస్తామని సెర్ప్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాజోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం భూపతివర్మ అధ్యక్షతన జరిగిన బీవోఏలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల సర్వే కోసం యాప్‌లో ప్రాథమిక సమాచారం, ఆర్థిక లావాదేవీల నమోదుపై ఎన్యూమరేటర్లకు, వీవోఏలకు శిక్షణ తరగతులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం ఎ.గణేష్, ఎం.విజయలక్ష్మికుమారి, సీసీ దుర్గ, అక్కౌంటెంట్ వి.నాగేంద్రకుమార్, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 45శాతం వరకు డిస్కౌంట్

అమలాపురం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆప్కో చేనేత వస్త్రాలపై 45శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్టు ఆప్కో రాజమహేంద్రవరం మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు తెలిపారు. కొత్త వస్త్రాలపై 30శాతం డిస్కౌంట్ ఇస్తామని, ఎంపికచేసిన చేనేత వస్త్రాలపై 45శాతం డిస్కౌంట్ అందిస్తామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, రావులపాలెం, కొత్తపేట, మలికిపురం పట్టణాల్లోని ఆప్కో విక్రయశాలల్లో చేనేత వస్త్రాలపై రాయితీ పొందవచ్చన్నారు. బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవళ్లు మొదలైన చేనేత వస్త్రాలు కొనుగోలుచేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి కార్మికులను ఆదరించాలని ప్రసాదరావు కోరారు.

ఆలయ పునర్నిర్మాణంలో బళ్ల సేవలు చిరస్మరణీయం


చింతా గణేష్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

యానాం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): యానాం చింతవారి వీధిలోని కోందడ రామాలయం పునర్నిర్మాణంలో కీర్తి శేషులు పుదుచ్చేరి రిటైర్డ్ ఎస్పీ బళ్ల వెంకటరత్నం (బళ్ల పోలీస్) సేవలు చిరస్మరణీయమని స్థానిక ప్రతినిధులు అన్నారు. ఆలయం పునర్నిర్మాణానికి తోడ్పాటు అందించి, ప్రతిఏటా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్విఘ్నంగా నిర్వహించడానికి ఆదాయం వచ్చేలా స్వామివారి పేరిట దరియాలతిప్పలో భూమిని కొనుగోలుచేసి కౌలుకు ఇవ్వడం వంటి ముందుచూపు చర్యలను వారు గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా బళ్ల వెంకటరత్నం చిత్రపటాన్ని కోదండ రామాలయంలో కుటుంబ సభ్యులు, పెద్దలు, సన్నిహితులు, శేయోభిలాషుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఆర్ఏ చింతా గణేష్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు యానానికి చెందిన పలువురు ప్రముఖులు, చింతా, బళ్ళ, తిక్కరెడ్డి వీధికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న అధ్యయనోత్సవాలు


వెంకన్న ఆలయంలో అధ్యయనోత్సవాలలో వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆత్రేయపురం, మార్చి28(ఆంధ్ర జ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే వేద అధ్యయనోత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నాల్గవరోజు శుక్రవారం మేళతాళ మంగళవాయిద్యాలతో వేకువజామునే గోదావరి నదీజల సంగ్రహణం, విశేష అర్చన, ప్రబంధ పారాయణం నిర్వహించారు. పండితులు ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వర్ణశోభితుడైన శ్రీవారిని వివి ధ రకాల పుష్పాలతో అలంకరించారు. సాం స్కృతిక ప్రదర్శనలు, కేరళ నృత్యకారుల వాయిద్యాలతో ఆలయ ప్రాంగణం మారోమ్రగింది. అనంతరంరాత్రి పల్లకి మహోత్సవం, శ్రీవా రు గరుడ, సింహ, హంసవాహనాలపై ఆశీ నులై వీధుల్లో విహరించారు. భక్తజనం పల్లకి మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఉపక మిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.


అన్నదాన ట్రస్టుకు విరాళం అందిస్తున్న దాతలు

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.25లక్షలు

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,25,586 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి మచిలీపట్నానికి చెందిన గ్రంధి అనిల్ కుమార్- సుప్రియ దంపతులు రూ.50వేలు విరాళం అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. అలాగే జబర్దస్త్ నటుల రైజింగ్ రాజు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు.

మహిళల ఉపాధి కల్పనకు కుట్టుశిక్షణ తరగతులు

● మంత్రి వాసంశెట్టి సుభాష్


కుట్టుశిక్షణా తరగతులు ప్రారంభోత్సవంలో మహిళలతో మంత్రి సుభాష్, ఆర్డీవో అఖిల

ద్రాక్షారామ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి కుట్టుశిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ ప్రకటించారు. శుక్రవారం రామచంద్రపురం పట్టణం, మండలంలో మహిళలకు మండల విద్యావనరుల కేంద్రం, మండల మహిళా సమాఖ్య కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణా తరగతులను మంత్రి ప్రారంభించారు. మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాల ద్వారా ఉచిత కుట్టుశిక్షణ, నైపుణ్య అభివృద్ధి పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ వెల్ఫేర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 6 ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో కేంద్రంలో 120 మందికి 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ 3నెలలపాటు ఇస్తామన్నారు. 75శాతం హాజరు నమోదు చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో బ్యూటీపార్లర్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో కూడా మహిళలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ ఏడాది 1.75 లక్షల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో అఖిల, బీసీ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ కె.ఈశ్వర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటర మణ, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, బాబూరావు, కొసనా శ్రీనివాస్ అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలి

● మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి

ఆలమూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు స్వయం సమృద్ధికి కృషిచేసి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆలమూరు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాజీ ఎంపీపీ కొత్తపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆలమూరు స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళల జీవనోపాధి-ప్రణాళిక తయారీ అనే అంశంపై శుక్రవారం మండలస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో కొత్తపల్లి ధనలక్ష్మి పాల్గొని ప్రస ంగించారు. పేద, మధ్య తరగతి, సామాన్య మహిళల జీవనోపాధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళలందరి జీవనోపాధి కల్పించడంతోపాటు అర్హులైన వారందరికీ రాయితీలపై రుణాలను అందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేసి నివేదికను రూపొందించాలని ఆమె కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్వాక్రా మహిళలకు మంజూరు చేయాల్సిన రుణాలు, ఏర్పాటు చేయదల్చుకున్న యూనిట్లు వివరాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఇటీవల ప్రతీ డ్వాక్రా సంఘానికి మంజూరు చేస్తున్న సుమారు రూ.20లక్షల వరకు రుణసాయం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ధనరాజు, యానిమేటర్లు పాల్గొన్నారు.


ఆలమూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి

ఘనంగా నూకాలమ్మ జాతర

కపిలేశ్వరపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, తదితర గ్రామాల్లో నూకాలమ్మ జాతర శుక్రవారంరాత్రి ఘనంగా జరిగింది. గ్రామ పురవీధుల గుండా అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చింతపల్లి

● ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు జారీ



మండపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) మండపేట వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలకవర్గంను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు వెలవడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ద్వారపూడి పంచా యతీపరిధిలోగల చినద్వారపూడి గ్రామాని కి చెందిన చింతపల్లి రామకృష్ణను చైర్మన్ నియమితులయ్యారు. వైస్‌చైర్మన్‌గా మో టుపల్లి బాపిరాజులు నియమితులయ్యారు. నూతన చైర్మన్‌గా నియమితులైన చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.అలాగే కూటమినాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం


సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

రాయవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అష్ట సోమేశ్వర ఆలయాల్లో ఒకటిగా పేరు గాంచిన మండలంలోని వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి పురస్కరించుకుని సోమేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, పార్వతి అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, సూర్యనమస్కారాలు శాంతి హోమం జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పొక్కులూరి సుబ్బారావు, తటవర్తి రాఘవరాజు, దువ్వూరి శ్రీరామశర్మ, పీవీఎస్ సూ ర్యనారాయణ, వాడ్రేవు వెంకట్రావు, వింజమూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జిల్లాలో 404 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● జిల్లా సివిల్స్ సప్లయిస్ మేనేజరు బాలసరస్వతి


సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ మేనేజర్ బాలసరస్వతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు 404 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సివిల్స్ సప్లయిస్ మేనేజర్ బాలసరస్వతి తెలిపారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో వివిధ మండలాల వ్యవసాయాధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది, ఎంఎస్‌వోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సమావేశంలో జ్యోతి మాట్లాడుతూ సాధారణ రకం క్వింటాలుకు రూ.2300, గ్రేడ్ ఏరకం రూ.2320లకు కొనుగోలు చేస్తామన్నారు. రబీ ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. గోనెసంచులు కొరత లేకుండా అవసరం మేరకు ముందుగా పొందుపరుచుకోవాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక పరమైన డేటా ఎంట్రీ, ట్రక్ షీట్, ధాన్యం సేకరణ సమయంలో శాంపిల్స్ విశ్లేషణ, పాటించాల్సిన ప్రమాణాలు, తేమ శాతం, వ్యర్థాలుశాతం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సివిల్ సప్లయిస్ అసిస్టెంటు మేనేజర్ నాగేశ్వరరావు, వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ఇఫ్తార్ విందులు దోహదం


ఇఫ్తార్ విందులో బాలుడిని ఎత్తుకున్నమంత్రి సుభాష్

ద్రాక్షారామ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ మసీదులో శుక్రవారం రాత్రి ఇఫ్తార్‌విందులో మంత్రి సుభాష్ ముస్లిం సోదరులతో కలసి పాల్గొన్నారు. మతసామరస్యానికి ఇఫ్తార్ విందులు దోహదం చేస్తాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

● మంత్రి సుభాష్

పవిత్రత, ఆత్మీయతలకు ప్రతీక ఇఫ్తార్


పెదపళ్ల మశీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు పవిత్రత, ఆత్మీయతలకు ప్రతీకలుగా నిలుస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం పెదపళ్ల మశీదులో శుక్రవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. హిందువులు, ముస్లింల ప్రధాన పండుగలు ఉగాది, రంజాన్ పక్కపక్కనే రావడం మతసామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లిం సోదరులతో కలసి ఇఫ్తార్ విందును ఆరగించారు.

రూ.38 వేలు రికవరీ... రూ.6,500 అపరాధ రుసుం

● ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ద్రాక్షారామ, మార్చి28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలంలో ఉపాధి హామీ పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో మస్టర్లలో లోపాలకు పలువురు క్షేత్రసహాయకుల నుంచి రూ.38058 వేలు రికవరీ, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసి స్టెంటు, గత ఏపీవోలకు రూ 6536వేలు పైచిలుకు అపరాధ రుసుం విధించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు డ్వామా పీడీ ఎస్.మధుసూధన్, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, ఎంపీపీ అంబటి భవా నీ, ఎస్ఆర్‌పీ కనకారావు, ఇన్‌చార్జి ఏపీవో ఈశ్వర్ హాజరయ్యారు. గ్రామాల వారీగా 2023-2024లో జరిగిన ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. మస్టర్లు లోపాల కారణంగా క్షేత్రసహాయకులు గ్రామాల వారీగా ద్రాక్షారామ రూ.267, హసన్‌బాద రూ.233 5, ఉండూరు రూ.6316, ఉట్రుమిల్లి రూ.2064, వెలంపాలెం రూ.21140, వెల్ల రూ.1867, వెంకటాయపాలెం రూ.1000, యనమదల రూ. 4069 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ఉట్రుమిల్లి, పలు తప్పిదాలకు సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్లు కృష్ణవేణి రూ.2178లు, ఏపీవో అరుణకు రూ.2179, టెక్నికల్ అసిస్టెం టు లావణ్యకు రూ.1000లు, సీవో నాగేశ్వరరావుకు రూ.1000, జేఈ రూ.179 అపరాధ రుసు ం విధించారు. సమావేశంలో సామాజిక తనిఖీ డీఆర్‌పీలు, క్షేత్రసహాయకులు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కె.గంగవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంపల్లి గ్రామంలో 21 సంవత్సరాల యువతి అదృశ్యమైంది. పామర్రు ఎస్.ఐ. ఎస్.కె. జానీభాషా తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. అద్దంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీవెంకటరమణ దంపతుల కుమార్తె ఈనెల 24న రాత్రి ఇంటివద్ద నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీనిపై యువతి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

రాయవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం పోషణ్‌బీ పడాయిబీ పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో ఎ.గజలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.విష్ణుకుమారి, పి.సునీత, ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈకార్యక్రమంద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషణతో కూడిన విద్యను అందించేందుకు చిన్నారుల భవిష్యత్‌కు ఒక మంచిపునాది వేయడానికి ఈకార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన 68 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊడుగులమ్మ జాతర ఉత్సవాలు

ఆలమూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి) ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామదేవత ఊడుగులమ్మ అమ్మవారు జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. జాతర ఉత్సవాల సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. నాయకులు దునే స్వామినాయుడు, రాయుడు సతీష్ పాల్గొన్నారు.

రుణాలతో జీవన విధానం మెరుగుపర్చుకోవాలి

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యేవేగుళ్ల

మండపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పీఎం అనుచిత్ జాతీ య అభ్యుదయ పథకం సెర్ప్ ఉన్నతి పథకం ద్వారా రుణాలు పొందినవారు వ్యాపారాలు చేసుకుని తమ జీవన విధానం మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండ పేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. మండపేట పట్టణ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మండపేట మండలానికి చెందిన నలుగురు ఎస్సీ మహిళలకు పీఎం అనుచిత్ యోజన సెర్ప్ ద్వారా మంజూరైన రూ.10.5లక్షల రుణాలను వేగుళ్ల లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్ర మంలో లబ్ధిదారులతో పాటు, టీడీపీ నేతలు పర్వతిన వీర్రాజు, వేగుళ్ల రామకృష్ణ, నూని వీర్రాజు, బొజ్జావెంకటేశ్వరరావు, ఎంపీఎం కె.రవిరాజా, ప్రసాద్, వీవోఏలు పాల్గొన్నారు.

'యువతకు స్వీయరక్షణ ఎంతో అవసరం'


పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న లీగల్ సెల్ సభ్యులు

కొత్తపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో యువతులకు స్వీయరక్షణ ఎంతో అవసరమని లీగల్‌సెల్ సీనియర్ న్యాయవాది అల్లు భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తపేట లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాదులు అల్లు భాస్కరరావు, డి.బాలప్రతాప్‌లు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినిలు తాత్కాలిక ఆకర్షణకు లోనుకాకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని తద్వారా తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, సీహెచ్ నాగారాణి, ఏ.దీపిక దేవి, వి.నాగదీపిక, సీహెచ్ .నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో విద్యార్థులకు అదనపు సౌకర్యాలు

● మంత్రి సుభాష్

ద్రాక్షారామ, మార్చి28(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో మానసిక దివ్యాంగ విద్యార్థులకు సీఎస్ఆర్ నిధులతో అదనపు సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి సుభాష్ ప్రకటించారు. శుక్రవారం రామచంద్రపురంలో భవిత కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు చేపడుతున్న కార్యక్రమాలు భవిత ఉపాధ్యాయులు మోర్తబాబు, చామర్తి నాగమణిలను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సీఎస్ఆర్ నిధులతో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీకు అవసరమైన పరికరాలు అందజేస్తామన్నారు. విద్యార్థుల కోసం రెండు ఆటోలు కొనుగోలుచేసి రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎంఈవోలు వీరరాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరిలు మాట్లాడుతూ రామచంద్రపురం మండలంలో 173 మంది మానసిక దివ్యాంగ విద్యార్థులను గుర్తించామని అందులో 50 మంది భవిత కేంద్రంలో ఉన్నారని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అదనపు సౌకర్యాల కల్పనకు హామీ ఇచ్చిన మంత్రి సుభాష్‌కు విద్యార్థుల తల్లితండ్రులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రామ సంఘాలకు ఆర్థిక ప్రణాళికపై శిక్షణ

కె.గంగవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 2025-2026 ఆర్థిక సంవత్సరంలో గ్రామ సంఘాల ఆర్థిక ప్రణాళిక తయారు చేయడంపై వెలుగు కార్యాలయంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వెలుగు ఏపీఎం దుర్గమ్మ మాట్లాడుతూ గ్రామ సంఘాలు రికార్డులు తయారు చేయడం, ఇప్పటివరకూ గ్రామ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపారాల లావాదేవీలు పరిశీలన, రాబోయే ఆర్థిక సంవత్సంలో ఏఏ అంశాల్లో ఎంతమేర రుణాలు ఇవ్వాలనే అంశాలను తయారు చేసే విషయాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దుర్గాదేవి, గ్రామ సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

చినద్వారపూడిలో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు

మండపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సారా రహితగ్రామాలే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎ.ఇఎస్. అమర్‌బాబు అన్నారు. మండలంలోని ద్వారపూడి పంచాయతీలో శుక్రవారం సారా నిర్మూలన నవోదయం 2.0లో భాగంగా సారా నిర్మూలన అనే అంశంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎ.ఇఎస్. అమర్‌బాబు మాట్లాడుతూ సారా వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రా మ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఆలమూరు ఎక్సైజ్ ఎస్.ఐ రాంబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.వీ.వీ.రమణ, వీఆర్‌వోలు, సచివాలయ ఉద్యోగులు స్థానికులు పాల్గొన్నారు.

పీఎంపీలు, ఆర్ఎంపీలకు అవగాహన అవసరం

మండపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించే పీఎంపీలు, ఆర్ఎంపీలు వైద్యంతోపాటు శస్త్రచికిత్సల పట్ల అవగాహన ఉండాలని రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నితిన్ అన్నారు. మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండపేటలోవున్న స్థానిక సూర్యగ్రాండ్ కన్వెన్షన్ హాల్లో జరిగిన అవగాహన సదస్సుకు మండపేట, రాయవరం, ఆలమూరు మండలాలకు చెందిన పీఎంపీ వైద్యులు హాజరయ్యారు. వారికి అధునాతన వైద్యవిధానం శస్త్రచికిత్సలపై నితిన్ అవగాహన కల్పించారు. బెరియాట్రిక్‌తోపాటు క్యాన్సర్ గురించి డాక్టర్ దివ్య వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, పీఎంపీ సంఘ నాయకులు ఎస్సీ రమణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో వైద్యులను సత్కరించారు.

పాస్టర్ ప్రవీణ్‌కు సంతాప సభ


పాస్టర్ ప్రవీణ్‌కు సంతాపం తెలుపుతున్న పాస్టర్లు

కె.గంగవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల క్రిస్టియన్ సమాజానికి చేసిన సేవలు చిరస్మ రణీయమని పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు అన్నారు. శుక్రవారం కె.గంగవ రం దీవెన గ్రౌండ్‌లో ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ డి.ఏలియా అధ్యక్షతన ప్రవీణ్ పగడాల సంతాప సభ నిర్వహించారు. తొలుత ప్రవీణ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఫెలోషిప్ సభ్యులు పాస్టర్ డి.జెకర్యా, ఎం.జాన్‌బాబు, ఎస్.రీచర్డ్, సామ్యూల్, పి.జార్జిపాల్, జి.అనిల్ బాబు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ద్రాక్షారామ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.సిద్దూ పిలుపునిచ్చారు. శుక్రవారం ద్రాక్షారామలో ఐటీఐ కళాశాలలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కె.వరప్రసాద్, తారక ముకేష్, దుర్గాప్రసాద్, ప్రసన్న, ధనుష్, భీమరాజ్ పాల్గొన్నారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రమణ




రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రామచంద్రపురం వికాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌గా వాసంశెట్టి వెంకటరమణ ఎన్నికయ్యారు. విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1145 ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ పరిధిలో వికాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వాసంశెట్టి వెంకరమణను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

పలు సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

● బిల్లులు చెల్లించకపోవడంపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం

● వాడివేడిగా మండల పరిషత్ బడ్జెట్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ బడ్జెట్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామాల్లోని పలు సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఈ సమావేశానికి హాజరుకాని వారి వివరాలను కూడా జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని ఎంపీడీవో రత్నకుమారిని ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారానికై నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు రాకపోతే ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను ఎవరికి చెప్పుకుంటారన్నారు. నేలటూరు, తాతపూడి గ్రామాల్లో గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులను నేటికీ చెల్లించకపోవడానికి కారణం ఏమిటని ఆయా గ్రామాల కార్యదర్శులపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకుండా ఎవరైనా అడ్డుకుంటున్నారా అని వారిని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. తల్లికి వందనం, 3ఉచిత సిలెండర్లు, రైతులకు రూ.20 వేలు, ఫీజు రియంబర్స్‌మెంట్, తదితర పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. ఊరికి 3 బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఫ్రీఇసుక పక్కదారి పట్టిందని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించాల్సిన ర్యాంపులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, కేదార్లంక ర్యాంపులో మిషన్లు పెట్టి మరీ తవ్వకాలు చేస్తున్నారని ఆయన ఆరో పించారు. ఆక్వా కల్చర్‌ను వ్యతిరేకిస్తున్నామంటూ సభ్యుల అభీష్టం మేరకు తీర్మానం చేసి జిల్లాకలెక్టర్‌కు పంపించాలన్నారు. పంటలకు సాగునీరు అందడంలేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకురాగా ఇరిగేషన్ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. అనపర్తి నియోజకవర్గంలో కేన్సర్ వ్యాధిపై సర్వే జరుగుతుందని, మన మండలంలో అలాంటి సర్వే జరుగుతుందా అని అచ్యుతాపురం ఎంపీటీసీ పలివెల మధు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీడీవో రత్నకుమారి శాఖలవారీ సమీక్ష జరిపారు. తొలుత మండలపరిషత్ ఏవో రాజేంద్ర ప్రసాద్ 2024-25 సవరణలు, 2025-26 అంచనాల బడ్జెట్‌పై సమావేశంలో చదివి వివరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, తహసీల్దార్ చిన్నారావు, ఈవోపీఆర్డీ మోహన్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారపూడిలో యువకుడిపై దాడి



మండపేట, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడిలో ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారి జాతర మహోత్సవంలో గురువారంరాత్రి ఒక యువకుడిపై పలువురు యువకులు దాడిచేసి గాయపరిచిన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండపేటరూరల్ ఎస్.ఐ బుజ్జిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన యువకుడు గోణం రాజేష్‌పై అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు దాడిచేసి తమపై దాడిచేసి గాయపరిచారని బాధితుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ తెలిపారు. దాడిలో గాయపడ్డ రాజేష్ ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.